క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జునస్వామి దివ్య కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు దంపతులు

కాకినాడ రూరల్: కొవ్వాడలోని భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయం(శివాలయం) వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారి దివ్య కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొని తిలకించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, ఉప సర్పంచ్ తోట కూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు మహిళలు శ్రమించాలి



ఆర్జేడీ నాగమణిని సత్కరిస్తున్న టీం సభ్యులు

బాలాజీచెరువు: మహిళలు లక్ష్య సాధనతో శ్రమించి తాము ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి పేర్కొన్నారు. యంగ్‌మైండ్-రేపటి కోసం టీమ్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ నేటి కాలంలో మహిళలు అన్ని రంగాలలో ప్రతిభ చూపుతున్నారని, మహిళ అభ్యున్నతి కోసం అందరూ సహకరిస్తునారన్నారు. మహిళలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంగ్‌మైండ్ అధ్యక్షుడు వాకాడ చిన్న,కార్యదర్శి బాపిరాజు,సభ్యులు రంగనాథ్, ఎంవీవీ సత్యనారాయణ, ఎంకే చక్రవర్తి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో హుండీల లెక్కింపు



బాలాత్రిపుర సుందరి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. 139 రోజులు వ్యవధికి గాను రూ. 6.47లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. హుండీ ఆదాయం మొత్తాన్ని బ్యాంకులో జమ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ మెషీన్ వితరణ



ఈఎన్‌టీ వైద్యపరీక్షలు ప్రారంభించిన దృశ్యం

బాలాజీచెరువు: నామమాత్రపు రుసుంతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు ఈఎన్‌టీ ఈసీసీ మిషన్ గ్రేస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అధినేత ముదునూరి కుమార్ రాజు సోమవారం ఉచితంగా అందజేశారు. దాదాపు రూ.5.4 లక్షల విలువ గల మిషన్ అందజేసి చెవి, ముక్కు, నోటికి సంబంధించి పరీక్షలు చేసేందుకు వీలుగా ల్యాబ్‌లో అమర్చారు. ఈ మిషన్‌ను పాస్టర్ ఎండీ రాజు ప్రారంభించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌లలో ఈ పరీక్షలకు దాదాపు వెయ్యి రూపాయలు వరకూ చార్జి చేస్తారని, కేవలం 150 రూపాయలకే మూడు రకాల వైద్య పరీక్షలతో పాటు నేరుగా వారి సమస్యను స్క్రీన్‌పై చూసే అవకాశం ఉందని బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్‌రాజు సతీమణి జ్యోతి, ఆర్‌వీ రమణమూర్తి, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సుదీర్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

కరప: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.ఏంజలిన్, గైనికాలజిస్ట్(కాకినాడ) డాక్టర్ పెదిరెడ్డి శ్రావ్య వైద్యపరీక్షలు నిర్వహించి, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది 43 మంది గర్భిణులకు రక్తపరీక్షలు, బీపీ, షుగరు టెస్టులు నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీహెచ్ఎస్‌లు డీవీవీ సత్యనారాయణ, కె.రాజ్‌గోపాలరావు, మహాలక్ష్మి, ఆశావర్కర్లు వైద్యసేవలందించారు. వేళంగి పీహెచ్‌సీలో కూడా డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ సిబ్బందితో కలిసి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

రబీ వరిపై తెగుళ్ల దాడి

- మారుతున్న వాతావరణం
- రాత్రి మంచు.. పగలు ఎండ
- వరి చేలను ఆశిస్తున్న తెగుళ్లు
- ఆందోళనలో అన్నదాతలు



ఏపుగా పెరుగుతున్న రబీ వరిచేలు



వరి దుబ్బును ఆశించిన సుడిదోమ

కాకినాడ రూరల్: ఖరీఫ్‌లో వరస తుపాన్లతో వరి సాగులో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రబీలో వాతావరణ మార్పులతో అన్నదాత కలవర పడుతున్నాడు. రబీలో రెండో పంటగా వరిసాగు చేపట్టిన రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు బడి చేపడుతున్నారు. నాలుగు నెలల పంట కాలంలో దాదాపు 60రోజులు పూర్తవ్వడంతో మిగిలిన సగం రోజులు చాలా కీలకం కానున్నాయి. ఏపుగా పెరుగుతున్న వరి చేలకు వాతావరణ మార్పులతో తెగుళ్ల పొడ చూపనున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడంతో పాటు రాత్రిపూట పొగ మంచు కురుస్తుండడంతో ఎండ తీవ్రత, తేమ కారణంగా దుబ్బు తెగులతో పాటు దోమ పోటుగా ఆస్కారం ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలో సుమారు 19వేల ఎకరాల వరి సాగవుతుండగా రూరల్ మండలంలో సుమారు 4500 ఎకరాలలో రబీ వరిసాగవుతుంది. తిమ్మాపురం, పండూరు, పి.వెంకటాపురం, నేమాం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాలలో ఏలేరు కింద, సర్పవరం, కొవ్వాడ, తూరంగి, చీడిగ, రేపూరు తదితర గ్రామాల్లో గోదావరి జలాలతో వరి చేలు సాగవుతున్నాయి. ఈ రబీ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు దాదాపు 65శాతం వరకు ఎంటీయూ-3626(బొండాలు) రకం వరి వంగడాన్ని సాగు చేస్తుండగా మిగిలిన 35 శాతం ఆయకట్టులో సన్నాలు రకం వరి వంగడాలు సాగు చేస్తున్నారు. మొత్తం ఆయకట్టులో 70శాతం వరకు ఎదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. ఏలేరు కింద సన్నాలు రకాలు ఎక్కువగాను, గోదావరి కింద బొండాలు ఎక్కువగా సాగు చేపట్టారు. ప్రస్తుతం లేత చేలు డబ్బు దశలోను, ముందుగా సాగుచేపట్టిన చేలు చిరు పొట్ట, అంకురం ఏర్పాడే దశలో ఉన్నాయి.

ఎండల తీవ్రత పెరడంతో వరి చేలలో దుబ్బు కుళ్ళు తెగులు వ్యాప్తితో పాటు దోమ ఆశించే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు వారి సూచనలు ఇలా ఉన్నాయి.

దుబ్బు కుళ్లు తెగులు నివారణ

కణువుల మధ్య భాగమంతా నల్లగాను, ఆకులు పసుపు రంగులోకి మారడం, పిలకలు కిందకు వాలిపోయి ఎండిపోవడం, క్రమంగా దుబ్బు అంతా ఎండిపోవడం ఈ తెగులు లక్షణం. నివారణకు తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి. తెగులు ఎక్కువగా ఉంటే నీరు తీసివేసి పొలం ఆరగట్టాలి. తెగులు ప్రారంభ దశలో ఉంటే హెక్సాకొనజోల్ 5ఎస్‌పీ రెండు ఎంఎల్ లేదా వాలిడామైసిన్ 3ఎల్ 2మీల్లీలీటరు మందును ఒక లీటరు నీటిలో కలిపి ఆ ద్రవణాన్ని 15 రోజులకు ఒక్కసారి రెండు సార్లు పిలకలు కింద వరకు పిచికారి చేయాలి.

సుడి దోమ నివారణ

పంట అంకురార్పణ దశలో గోదుమ వర్ణపు, తెల్ల మచ్చ దోమలు ఎక్కువగా ఆశిస్తాయి. ఈ దోమలు 6 నుంచి 12 వరకూ గుడ్లను సముదాయంగా కాండం ఒరలలోను, కాండం కణజాలంలో చొప్పిస్తాయి. ఒక్కో ఆడదోమ సుమారు 300 నుంచి 500 వరకు గుడ్లు పెట్టే అవకాశం ఉండగా ఐదు దశల్లో పెరిగి 12 నుంచి 23 దశల్లో పూర్తి దశకు చేరుకుంటాయి. పిల్ల, తల్లి దోమలు దుబ్బు మొదళ్ల నుంచి రసం పీల్చడం వలన పోషకాలు మొక్కలకు అందక అవి పసుపు రంగులోకి మారి క్రమేపీ సుడులుగా ఎండిపోవడం వలన రైతులు పైరును నష్టపోయే అవకాశం ఉంది. దీని నివారణకు ప్రతి రెండు మీటర్ల నాట్లకు మధ్య కాలి బాటలు, ఎసిఫేట్ 75ఎస్‌పీ 1.5 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 50డబ్ల్యూజీ 0.6 గ్రాములు, లేదా డైనోటెప్యురాన్ 20 ఎస్‌జీ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వరిచేలు 60పంట కాలం దాదాపు పూర్తి చేసుకోవడంతో వాతావరణ మార్పులు కారణంగా తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఉష్ణోగ్రతలు క్రమేణా పెరుగుతుండడంతో గాలిలో తేమ, అధిక ఉష్ణోగ్రతలు కారణంగా సుడి దోమ ఆశించే అవకాశం ఉంది. వాతావరణ మార్పులతో దుబ్బుకుళ్ళు తెగులు ఆశించవచ్చు.

– చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయాధికారి – కాకినాడ రూరల్.

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభం

కాకినాడ రూరల్: స్థానిక కేంద్రియ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైందని విద్యాలయ ప్రిన్సిపాల్ బి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకానికి, ప్యానెల్ సిద్ధం చేయడానికి కేంద్రీయ విద్యాలయం కాకినాడలో ఈ నెల 14వ తేదీ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హతలున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలన్నారు.

పేద మహిళలకు చేయూత

కాకినాడ క్రైం: అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళలకు చేంజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతనిచ్చింది. దాతలకు వారి పరిస్థితిని వివరించి స్వయం ఉపాధి కల్పించింది. ఈ మేరకు సోమవారం కాకినాడలోని సంస్థ కార్యాలయంలో మేనేజర్ భవానీ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ల వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా లెప్రసీ నివారణాధికారి(డీఎల్‌వో) డాక్టర్ రోణంకి రమేష్ అతిథిగా హాజరై మహిళలకు కుట్టుమెషీన్లు అందజేశారు. పేద మహిళల జీవనోపాధికి కృషి చేసిన చేంజెస్ సంస్థ మేనేజర్ భవాని సహా బృందాన్ని అభినందించారు.

15 బెల్ట్‌షాపులపై కేసు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో గడచిన మూడు రోజుల పాటు నిర్వహించిన వరుస తనిఖీల్లో 15 బెల్ట్‌షాపులు గుర్తించి కేసులు నమోదు చేసి, వాటి నిర్వాహకులైన 15 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీల్లో 19.08 లీటర్ల మద్యం, 2.6 లీటర్ల బీరు సీజ్ చేశామని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను ఆయన చాంబర్‌లో ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, చెన్నై డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రవీణ్‌బాబు, వికాస పీడీ లచ్చారావు మర్యాద పూర్వకంగా కలిశారు. వికాస ద్వారా సుమారు వంద మంది అభ్యర్థులకు ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. సీఎస్ఆర్ ద్వారా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ట్రెనింగ్ ఇచ్చి తమ కంపెనీలో రూ. 20 వేలు జీతం, ఇన్సెంటీవ్స్‌తో బీపీఓ ఉద్యోగం కల్పించనున్నామన్నారు. కార్పొరేట్ హెడ్‌తో మాట్లాడి కాకినాడలో ఒక బ్రాంచ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. దీని ద్వారా మరింత మందికి తమ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రవీణ్‌బాబు కలెక్టర్ షణ్మోహన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి ప్రవీణ్‌బాబు

నౌకదళంతో దేశానికి సేవ చేసే అవకాశం

బాలాజీచెరువు: యువత నౌకదళంలో చేరడం ద్వారా దేశానికి సేవ చేసే అవకాశంతో పాటు మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. హ్యూండయ్ సంస్థ, తూర్పునౌకదళం సంయుక్తంగా కోల్‌కత్తా-కన్యాకుమారి, చెన్నై వరకూ చేపట్టిన కార్ ర్యాలీ సోమవారం జేఎన్‌టీయూకే వర్సిటీకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు నేవీ, ఉపాధి అవకాశాలు, కెరీర్‌పై అవగాహన కల్పించారు. తూర్పునౌకదళ కమోడోర్ అమర్జీత్ సాలుజా మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన కోల్‌కతాలో ప్రారంభమైన మోటర్ కార్ ర్యాలీ చెన్నై, కన్యాకుమారి మార్గంలో ప్రయాణించి 21వ తేదీతో ముగుస్తుందని, సముద్రతీరంపై అవగాహనతో పాటు యువతకు భారత నౌకదళ అవకాశాలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



నౌకదళంపై విద్యార్థులకు వివరిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్

ఫీల్డ్ అసిస్టెంట్ రాము సేవలు ఆదర్శం

కరప: జాతీయ ఉపాధి హామీ పథకం వేతనదారులందరికీ సమానంగా పనులు కల్పించి, నిజాయతీగా పని చేసిన ఫీల్డు అసిస్టెంట్(ఎఫ్ఎ) వాసంశెట్టి రాము సేవలు అందరికీ ఆదర్శమని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కరప గ్రామానికి చెందిన వాసంశెట్టి రాము ఫీల్డు అసిస్టెంట్‌గా గత 17 ఏళ్లగా పనిచేస్తున్నారు. గతేడాది పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఆయన ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఎఫ్ఏ రాము సేవలకు గుర్తింపుగా సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి పథకం మేట్లు గీసాల లక్ష్మి, పట్టా దేవి, మోకన గంగాభవాని, కట్టా వెంకట లక్ష్మి, ఇళ్ల భవాని తదితర సిబ్బంది ఏర్పాటు చేసిన సత్కార సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ రామును ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉపాధి పథకం సిబ్బంది, మేట్లు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏపీఓ జీవీ రమణకుమార్, జేఈ సంగీతలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాజేంద్రర్, జి.ప్రకాష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కరపలో ఫీల్డు అసిస్టెంట్ రామును సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ ఆశాజ్యోతి

సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఆదర్శం

బోట్‌క్లబ్: సావిత్రిబాయ్ పూలే నేటి తరానికి ఆదర్శవంతమైన మహిళ అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సన్ రైజ్ ఆసుపత్రిలో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సావిత్రి బాయ్ పూలే మహిళల కోసం ఎంతో పోరాటం చేశారన్నారు. ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణులు బొండా సూర్యారావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అన్నారు, ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య అని, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సావిత్రీ బాయిపూలేకు నివాళులర్పిస్తున్న వైద్యులు అడ్డాల సత్యనారాయణ, బొండా సూర్యారావు

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కరప: వేళంగిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గతేడాది అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామస్తుల వినతి మేరకు రూ.45 లక్షలు నిధులు మంజూరు చేయగా, భక్తులిచ్చిన విరాళాలతో కలిసి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్టు సానా శ్రీనివాస్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు, శాంతి కల్యాణం జరిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, మాజీమంత్రి కురసాల కన్నబాబు, స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేళంగి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.



వేళంగిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీమంత్రి కన్నబాబు

గురుకులంలో విచారణ

కరప: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయం(బాలుర)లో సోమవారం విద్యార్థులను జనసేన నాయకుడు కొట్టడంపై అధికారులు, నాయకులు విచారణ జరిపారు. గురుకులం విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థులను జనసేన పార్టీ నాయకుడు భోగిరెడ్డి గంగాధర్ పిడిగుద్దులతో కొట్టడం, బూటు కాలుతో తన్నినట్టు విద్యార్థులు మీడియాకు తెలిపిన విషయం పాఠకులకు విదితమే.. కాగా పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పెద్దాపురం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎర్నెస్ట్‌ను ఆదేశించారు. గురుకుల విద్యాలయాల కన్వీనర్ ఎర్నెస్ట్ కరప గురుకుల విద్యాలయంలో సోమవారం టెన్త్ విద్యార్థులతో సమావేశమై జరిగిన విషయంపై విచారణ చేశారు. అసలేం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. మరో వారం రోజుల్లో పరీక్షలు జరగనున్నాయి, అనవసర విషయాల్లోకి వెల్లకుండా శ్రద్ధగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని కన్వీనర్ ఎర్నెస్ట్ తెలిపారు.

ఎంపీపీ విచారణ : కరపలోని గురుకుల విద్యాలయానికి సోమవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి వెళ్లి పదో తరగతి విద్యార్థులను ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ నాయకుడు గంగాధర్, పోలీస్ కానిస్టేబుల్ మరో ఇద్దరు నాయకులతో కలిసి వచ్చి ప్రిన్సిపాల్ కృష్ణారావు సమక్షంలో ఏ తప్పు చేయకపోయినా, మందు తాగుతున్నామని, అలా చూస్తున్నావేంటంటూ తమపై దాడి చేశారని, బూటుకాలుతో తన్నారంటూ విద్యార్థులు తెలిపారు. చదువుకుని, ఉద్యోగాలు చేస్తారని, తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తుంటే, అల్లర, చిల్లరగా తిరగడం సరికాదని, కష్టపడి చదుకుంటూ, పరీక్షలు రాయాలని విద్యార్థులకు నచ్చచెప్పి, వచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీలక్ష్మి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు అల్లరి చేస్తుంటే ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు కానీ, పోలీసస్టేషన్ కానీ, సంబంధిత అధికారులకు కానీ ఫిర్యాదు చేసి ఉండాల్సిందన్నారు. గురుకుల విద్యాలయం పనితీరు అసలుబాగోలేదన్నారు. తరగతి గదుల్లో పరిశుభ్రతలేదు, వాష్‌రూమ్‌లు నిర్వహణకూడా అధ్వాన్నంగా ఉందన్నారు. దీనిపై జిల్లాపరిషత్ సమావేశంలో కరప గురుకుల విద్యాలయం గురించి, ప్రిన్సిపాల్, సిబ్బంది పనితీరుపై చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరతానన్నారు. రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు కూడా గురుకులంలో జరిగిన విషయాలను అడిగితెలుసుకున్నారు. తమపై పోలీసుకానిస్టేబుల్, నాయకులు చేసిన దౌర్జన్యాన్ని వివరించగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



కరప గురుకుల విద్యాలయంలో టెన్త్ విద్యార్థులను విచారణ చేస్తున్న గురుకుల విద్యాలయాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్



గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

బోట్‌క్లబ్: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి కమిషనర్ భావన హాజరయ్యారు. ఐదుగురు డయల్ యువర్ కమిషనర్ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా 40 సమస్యలపై అర్జీలు అందాయి. వాటిపై కమిషనర్ భావన సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

దారి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ వినతి

కాకినాడ సిటీ: పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో తన పొలంలో ఉన్న దారి నుంచి వెళ్లనివ్వకుండా, నా పొలానికి నీరు పారనీయకుండా శెట్టి గంగాధర్ అనే వ్యక్తి అడ్డుపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కందరాడకు చెందిన 80 ఏళ్ల వృద్ధుడు శెట్టి బుల్లబ్బాయి జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు కందరాడ గ్రామంలో రెండు ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని బుల్లిబ్బాయి వివరించారు. తన భూమిలోకి వెళ్లకుండా ట్రాక్టర్‌తో దమ్ము, నాట్లు వేసుకునేందుకు వీలు లేకుండా చేస్తున్నాడని, ఎందుకు ఇలా చేస్తున్నావని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. గతంలో రీ సర్వే సమయంలో మా ఇద్దరి మధ్య సరిహద్దులు నిర్ణయించారని, సరిహద్దులు దాటి వచ్చి నా భూమిని కొద్ది, కొద్దిగా కలిపేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తకు ఆరోగ్యం బాగోలేక గత మూడేళ్లుగా నా భూమిని కౌలుకి ఇచ్చేశానని, అతడు నా భూమిలో నీరు కడుతుంటే గంగాధర్ బయటకు తీసేస్తున్నాడన్నారు. అడుగుతుంటే రౌడీలా దౌర్జన్యం చేస్తున్నాడని, బెదిరింపులకు దిగుతున్నాడని బుల్లిబ్బాయి ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆడవాళ్లను తీసుకొచ్చి కౌలుదారుడు వేసిన వరి నాట్లు దౌర్జన్యంగా పీకేస్తున్నాడన్నారు. గంగాధర్ చేస్తున్న దౌర్జన్యాల నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు బుల్లిబ్బాయి వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పిఠాపురం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌కు బుల్లిబ్బాయి ఫిర్యాదును పంపి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్టు బుల్లిబ్బాయి వివరించారు.



కలెక్టర్ షణ్మోహన్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న బుల్లబ్బాయి

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

కరప: నడకుదురు రామలింగేశ్వర కాలనీలోని విజయ గణపతి స్వామివారి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని సోమవారం భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి తనతండ్రి మాణిక్యాలరావు జ్ఞాపకార్థం ఏటా కుటుంబ సభ్యులు రామలక్ష్మి, సూర్యప్రకాషరావులతో కలిసి వార్షికోత్సవ రోజున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అర్చకుడు గొట్టిముక్కల సూర్యప్రకాషరావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పల్లకీలో ఉంచి, గ్రామోత్సవం నిర్వహించారు. యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, అచ్చిరెడ్డి శ్రీమన్నారాయణ, చాగంటి నాగేశ్వరరావు, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరప: స్థానిక విష్ణాలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక కళ్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి వేద మంత్రోచ్చారణలతో, మంగలవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. పాల్గుణ మాసం శుద్ధ ఏకాదశి రోజున కల్యాణ వేడుకలను దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, హోమం వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విడ్డి ఫణేంద్రకుమార్, కరప, పిఠాపురం, తిరుపతి చదరాడ, కాకినాడ, పుట్టకుండ ఈఓలు కె.తిరుమలరవితేజ, సౌజన్య, వడ్డి శ్రీనివాస్, మోర్త మురళీవీరభద్రరావు, వడ్డి సత్తిబాబు ఆయా ఆలయాల తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కరప, పరిసర గ్రామాల భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని శ్రీరామచంద్రమూర్తి దేవస్థానంలో సోమవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి 9.20 గంటలకు రజిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పైండా రామకృష్ణారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం పాస్టర్‌పేటలోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శిరిడిసాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బాబా ఆలయంలో 400 మంది సత్యవ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా వారికి వివిధ రకాలు పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ భక్త బృందం, స్వర్గీయ కేవీ ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు సహకారంతో విద్యార్థులకు పెన్నులు బహూకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎల్ ప్రసాద్ మాస్టర్, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు, బీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కర్రి శ్రీరాముడు, కర్రి సత్యనారాయణ, దుర్గారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గణపతిని దర్శించుకుంటున్న మానవహక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి తదితరులు



ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న పండితులు



సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు